తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి


www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం   సూర్యాపేట   యాద్రాద్రి భువనగిరి

ఆదివారం 10 మే 2026 | పేజీలు : 8





# బండలు పగిలేలా ఎండ..

# మణుగూరులో భగ్గుమంటున్న భానుడు

- నీడ నీరు లేక అల్లాడుతున్న ప్రజలు
- రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న వడదెబ్బ కేసులు
- రోడ్లపై నడవలేని పరిస్థితి
- ఇళ్లలో ఊపిరాడని వేడి

**మణుగూరు, మే 09 (జనంసాక్షి):** ఈ ఏడాది వేసవి లో భానుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తోంది. ఉష్ణోగ్రతలు సాధారణాన్ని మించి నమోదు అవుతుండటంతో వడదెబ్బలు, నీరసం, తలనొప్పి, స్పృహ కోల్పోయే ఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా కార్మికులు, రైతులు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు అత్యధిక ప్రమాదంలో ఉన్నారు.దంచి కొడుతున్న ఎండ? వడదెబ్బతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఉదయం 9 గంటలకే భగ్గుమంటున్న ఎండ మధ్యాహ్నం అయితే రోడ్లపై నడవలేని పరిస్థితి?ఇళ్లలో ఉన్నా ఊపిరాడని వేడి?ఇది వాతావరణ హెచ్చరిక కాదు?ప్రజలు ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వాస్తవం.

**ఎండలోనే జీవనం :**

పొట్ట నింపుకోవాలంటే ఎండలోకి వెళ్లక తప్పని పరిస్థితి. రోజువారీ కూలీలు "ఎండ ఎక్కువగా ఉందని పని మానేస్తే ఆ రోజు వంటగది వెలవెల"రోడ్లపై నీడ లేకుండా పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురవుతున్నా పట్టించుకునే వ్యవస్థ కనిపించడం లేదు. అయినా సరే, ప్రజల్లో అవగాహన కొరవడుతోంది. "దాహం వేయకపోయినా నీరు తాగాలి" అన్న సాధారణ విషయాన్ని కూడా చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. బస్ స్టాపుల్లో నీడ లేదు రోడ్లపై తాగునీటి వసతి లేదు కార్మికులకు విశ్రాంతి సమయం అమలు కావడం లేదు ఇది కేవలం ప్రకృతి దోషమా?

మిగతా 10లో

## ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తాం

## మంత్రి పొంగులేటి

వార్త లోపలి పేజీలో



## అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి

# జీవితాలను నాశనం చేసుకోవద్దు

## డిఎస్పీ అరుణ్ కుమార్

**భద్రాచలం మే 09 (జనంసాక్షి) :** భద్రాది కొత్తగూడెం జిల్లా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని భద్రాచలం

మిగతా 2లో



- జలాల్‌పూర్ చెరువు కట్టపై శాశ్వత పరిష్కారం ఎప్పుడూ..?
- మూల మలుపులు తొలగించాలని స్థానికుల డిమాండ్
- హామీలకే పరిమితమైన భద్రతా పనులు

# ప్రమాదకర మలుపు

## అదుపు తప్పితే చెరువులోకే..!

**భూదాన్ పోచంపల్లి, మే 9 (జనంసాక్షి):** మండలంలోని జలాల్‌పూర్ చెరువు కట్టపై ఉన్న ప్రమాదకర ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 2024 డిసెంబర్‌లో కారు చెరువులోకి దూసుకెళ్లి ఐదుగురు యువకులు మృతి చెందిన ఘటన ప్రాంత ప్రజలను కలచివేసింది. ఘటన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా ఇప్పటివరకు శాశ్వత భద్రతా చర్యలు ప్రారంభం కాకపోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీసింది.

**ప్రమాదాలకు కారణమవుతున్న ప్రమాదకర మలుపులు**

చెరువు కట్టపై వరుస మలుపులు ఉండటంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు నియంత్రణ కోల్పోయి చెరువులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర మూల మలుపులను తొలగించి రోడ్డును విస్తరించడంతో పాటు బలమైన ప్రహరీ నిర్మిస్తే ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

**రూ.20 లక్షల హామీ.. పనులు మాత్రం శూన్యం**

ప్రమాదం అనంతరం స్థానిక ఎమ్మెల్యే చొరవతో జలాల్‌పూర్ చెరువు వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై రోడ్ సేఫ్టీ పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రోడ్ మార్కింగ్‌లు, హెచ్చరిక సైన్ బోర్డులు, మెటల్ రక్షణ కవచాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

మిగతా 2లో

# మణుగూరులో భగ్గుమంటున్న భానుడు






లేదా వ్యవస్థ వైఫల్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థలు వెంటనే స్పందించి తాగునీటి శిబిరాలు చలివేంద్రాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టక పోతే ముప్పు తప్పదు.

**వడదెబ్బ లక్షణాలు:**

తీవ్రమైన తలనొప్పి వాంతులు, మైకం శరీరం వేడిగా మారడం చెమట రాకపోవడం స్పృహ కోల్పోవడం ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి బట్టలు సడలించి, చల్లని నీటితో శరీరం తుడవాలి.స్పృహ ఉంటే నీరు ఓ ఆర్ ఎస్ ఇవ్వాలి.వెంటనే ఆస్పత్రికి తరలించాలి . నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదం..

**వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వేసవిలో (ఎండాకాలంలో) ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ముఖ్యమైన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్ అన్నారు.శరీర ఆరోగ్యం కోసం రోజుకు 8 ,10 గ్లాసుల నీరు తాగాలి.కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం లాంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి.బయటికి వెళ్లినప్పుడు గొడుగు టోపీ సన్ గ్లాసెస్ ఉపయోగించాలి.ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అత్యవసరం లేకపోతే బయటికి వెళ్లకపోవడం మంచిది. ఆహారంలో జాగ్రత్తలు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి.పుచ్చకాయ, దోసకాయ, బొప్పాయి, మామిడి వంటి కాలానుగుణ పండ్లు తీసుకోవాలి. మసాలా, నూనె, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తీసుకోవాలి బయట తినే ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్త చర్మ సంరక్షణ బయటికి వెళ్లే ముందు సన్ స్క్రీన్ క్రీమ్ వాడాలి.రోజుకు కనీసం రెండుసార్లు ముఖం కడగాలి.ఎక్కువ చెమట పట్టే చోట్ల శుభ్రంగా ఉంచాలి .పిల్లలు వృద్ధులకు చిన్న పిల్లలు, వృద్ధులు డీహైడ్రేషన్‌కు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది తరచుగా నీరు తాగిస్తున్నారా చూసుకోవాలి.



ఎండలో ఎక్కువసేపు ఉండనివ్వొద్దు.కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ఓ ఆర్ ఎస్ తాగడం మంచిది.మద్యం, ఎక్కువ కాఫీ, కోల్డ్ డ్రింక్స్ సేవించొద్దు. లేత రంగు, పత్తి దుస్తులు ధరించాలని సూచించారు.

**-ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్..**

### అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి

## జీవితాలను నాశనం చేసుకోవద్దు

### డీఎస్పీ అరుణ్ కుమార్




పట్టణ డీఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ, మనుబోతుల చెరువు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో భద్రాచలం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ, మనుబోతుల చెరువు, డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 300 ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 30 ద్విచక్ర వాహనాలను, 5 ఆటోలను సీజ్ చేసి సుక్మా జిల్లాకు చెందిన ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కాలనీల్లో నివసించే స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డీఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, కోడిపందాలు, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదన్నారు. తమ కాలనీల్లోకి కొత్తగా ఎవరైనా వ్యక్తులు అద్దెకు వస్తే, ఇంటి యజమానులు వారి ఆధార్ కార్డు, చిరునామాలను సేకరించి పెట్టుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ లో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్సైలు తిరుపతి, స్వప్న, రామకృష్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదకర మలుపు : అదుపు తప్పితే చెరువులోకే..!



**తాత్కాలిక చర్యలతోనే సరిపెట్టిన అధికారులు**

ప్రస్తుతం అక్కడ తాత్కాలికంగా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్ లైట్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇవి పూర్తిస్థాయి భద్రత కల్పించలేవని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ప్రాణభయంతో ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో పలుమార్లు ఆందోళనలు

జలాల్‌పూర్ చెరువు కట్టపై ప్రమాదాలు నివారించాలంటూ గ్రామస్థులు గతంలో పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు. చెరువు కట్టపై బలమైన ప్రహరీ నిర్మించాలని, ప్రమాదకర ప్రాంతాలను తొలగించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పర్యాటక మార్గంగా కీలకమైన రహదారి**

ప్రపంచ పర్యాటక ప్రాధాన్యం కలిగిన భూదాన్ పోచంపల్లికి దేశ విదేశాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎక్కువగా జలాల్‌పూర్ చెరువు కట్ట మీదుగానే ప్రయాణిస్తుంటాయి. ఇలాంటి కీలక మార్గంలో సరైన భద్రతా చర్యలు లేకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలంటూ ప్రజల డిమాండ్ చెరువు కట్టపై బలమైన ప్రహరీ నిర్మాణంతో పాటు ప్రమాదకర మలుపులను తొలగించి రోడ్డును విస్తరించాలని గ్రామస్థులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక సిగ్నల్స్, స్పీడ్ కంట్రోల్ చర్యలు చేపట్టి వెంటనే శాశ్వత భద్రత కల్పించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



"చెరువు కట్టపై ఉన్న ప్రమాదకర మలుపుతో గ్రామ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికే జరిగిన ప్రమాదాల్లో ప్రాణనష్టం జరిగినప్పటికీ శాశ్వత పరిష్కారం అమలు కాలేదు. చెరువు కట్టపై రోడ్డును విస్తరించి ప్రమాదకర మలుపులను తొలగించడంతో పాటు ప్రహరీ, రక్షణ గోడల నిర్మాణ పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలి. ఇక ఆలస్యం చేస్తే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది."

**కొయ్యడ లింగస్వామి**



"జలాల్‌పూర్ చెరువు కట్టపై ప్రహరీ నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు పాత బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొంత ఆలస్యం జరిగింది. ఈ విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే పెండింగ్ సమస్యలు పరిష్కరించి పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం."

**ఆర్ అండ్ బి అసిస్టెంట్ ఇంజనీర్ బాలరాజు**



"జలాల్‌పూర్ చెరువు కట్టపై ఉన్న ప్రమాదకర మూల మలుపుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు కట్టపై ప్రయాణం ప్రజలకు ప్రాణాంతకంగా మారింది. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందన లేదు. రెండు సంవత్సరాల క్రితమే ఆర్ అండ్ బీ శాఖ ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేసినప్పటికీ చెరువు కట్ట భద్రతా పనులు ప్రారంభం కాలేదు. జలాల్‌పూర్ చెరువు కట్టపై ఉన్న ప్రమాదకర మూల మలుపులను తొలగించి రోడ్డును స్ట్రెయిట్‌గా నిర్మించడంతో పాటు చెరువులోకి వాహనాలు దూసుకెళ్లకుండా ప్రహరీ, రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భద్రతా పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నాం."

**శాపాక లింగస్వామి, సర్పంచ్, జలాల్‌పూర్ గ్రామం**



"జలాల్‌పూర్ చెరువు కట్టపై రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. ప్రమాదకర మూల మలుపు ఉండటంతో చిన్న పొరపాటు జరిగినా వాహనాలు చెరువులో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు ఆలస్యం చేయకుండా భద్రతా పనులు వెంటనే చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలి."

**కేసారం మధుసూదన్ రెడ్డి ఉపసర్పంచ్, జలాల్‌పూర్ గ్రామం**



# ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

## ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తాం: మంత్రి పొంగులేటి

**తిరుమలాయపాలెం, (జనంసాక్షి ) :**
పేదల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దీవెనలతో ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో ఏడాదిలోకి అడుగుపెట్టిందన్నారు. "ప్రజల వద్దకే ప్రభుత్వం", "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాల ద్వారా గ్రామస్థాయిలో సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో క్లస్టర్ల వారీగా ప్రజాదర్బార్ నిర్వహిస్తూ ప్రతి గ్రామం నుంచి వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరిస్తున్నామని చెప్పారు.ఇప్పటివరకు సుమారు 14 వేలకుపైగా దరఖాస్తులు అందాయని, అందులో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, భూముల సమస్యలు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్‌కు సంబంధించినవేనని పేర్కొన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభమవుతుందని వెల్లడించారు.ధరణి కారణంగా ఏర్పడిన భూముల సమస్యలను "భూభారతి" ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, గ్రామాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నను తప్పకుండా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రైతులకు రుణమాఫీ, విద్యార్థుల హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. ప్రతి అర్జీని పరిశీలించి న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, తిరుమలాయపాలెం గ్రామపంచాయతీ అధ్యక్షుడు, ఆత్మ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీను, చావా శివరామకృష్ణ, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చెరువు మట్టితో భూసారం పెంపు

## పంట అవశేషాలు కాల్చొద్దు

## జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య

**కారేపల్లి,మే09(జనంసాక్షి) :**
చెరువు మట్టితో భూసారం పెంచవచ్చని రైతులు చెరువు మట్టిని పోలాలకు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సింగరేణి మండలంలోని అప్పాయిగూడెం చెరువులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య పాల్గన్నారు. అనంతరం సింగరేణి, అప్పాయిగూడెం గ్రామాల్లో రైతులతో సమావేశమై వ్యవసాయ భూముల సారవంతం పెంపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ చెరువు మట్టి వల్ల భూమిలో పోషకాలు పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరి, మొక్కజన్న వంటి పంటలను కోసిన అనంతరం మిగిలే పంట అవశేషాలను ఎట్టి పరిస్థితిలో కాల్చకుండా భూమిలో కలియదున్నుకోవాలని రైతులకు సూచించారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి పోషకాలు నాశనం కావడంతో పాటు వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పంట అవశేషాలను కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, పశుగ్రాసం, సైలేజ్, మల్చింగ్, బయోగ్యాస్ తయారీ వంటి ఉపయోగాలకు వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ వెంకట్‌నాయక్, ఇరిగేషన్ ఏఈ నాగయ్య, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, ఏఈవో మున్నీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పని హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వం

## ○కొత్త నిబంధనలతో ఉపాధి దూరం○ ఉపాధి పని ప్రదేశాన్ని సందర్శించిన వ్యకాస



**కారేపల్లి,మే09(జనంసాక్షి) :**
కేంద్రంలోని మోడి ప్రభుత్వం రాజ్యాంగ బద్ద పని హక్కును హరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. శనివారం కారేపల్లి మండలం ఎర్రబోడు లో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యకాస బృందం సందర్శించింది. కూలీలలో వ్యకాస నేతలు మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారాల తరబడి వేతనాలు అందటం లేదని, రెండు సార్లు ఫోటో విధానంతో ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు తెలిపారు. కూలీలకు సమస్యలు, డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణి చేశారు. ఈసందర్బంగా వ్యకాస నేత కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ను వీబీజీరాంజీ గా పేరు మార్చటంతో పాటు నిధులలో కోత విధించిందన్నారు. ఉపాధి నిధులలో కేంద్రం 60 శాతం ఇస్తామని మిగతాది 40 శాతం ఇవ్వాలని షరతులతో లక్ష్యం నీరుగారే పరిస్థితి వచ్చిందన్నారు. రోజు వారి కూలీ రూ.307 ఇవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా పడటం లేదన్నారు. పని ప్రదేశాలలో టెంట్, నీరు, మెడికల్ కిట్స్ కల్పించటం లేదన్నారు. కూలీలకు ప్రమాధ భీమా కేంద్రం ప్రభుత్వం అమలు చేయాలని ప్రమాదానికి గురైతే రూ.10 లక్షలు సాయం అందించాలన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రూ.600 వేతనం, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలందరికి ఇస్తానన్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం సమస్యలపై ఈనెల 15న ఖమ్మం కలెక్టర్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కరపటి సీతారాములు, బోజడ్ల యాదగిరి, చరప వీరస్వామి, నర్సింగ్ సత్యనారాయణ, దుప్పెల్లి శ్రీనివాస్, కల్తి భద్రయ్య, కనికరపు వెంకన్న, లక్ష్మణ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాద శక్తులు

## పాటిమీదిగుంపులో ప్రజానాట్యమండలి శిబిరం



**కారేపల్లి,మే09(జనంసాక్షి) :**
మతోన్మాద, పెట్టుబడిదారి శక్తులు ప్రజలను ప్రభావితం చేసే మీడియా, సినిమా రంగంలోకి ప్రవేశంచి చరిత్రను వక్రీకరించే పనిలో పడ్డాయని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నామా లక్ష్మినారాయణ లు విమర్శించారు. కారేపల్లి మండలం ఎర్రబోడులో శనివారం జరిగిన సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ పెట్టుదారి మీడియా నుండి అసలు చరిత్ర మరగును పడకుండా ఉండాలనే ప్రత్యామ్నాయ ప్రజా కళలను ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. ప్రజా కళలు శ్రమైక జీవన సౌందర్యాన్ని శ్రమజీవుల కష్టాలను అవిష్కరిస్తాయన్నారు. ప్రత్యామ్నాయ ప్రజా కళలను ప్రోత్సహించడంతోనే ప్రజా చైతన్యం సాధ్యమన్నారు. ఈనెల 17వ తేది నుండి 19 వరకు ప్రజానాట్యమండలి పాటల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి పాటిమీద గుంపులో జరిగే శిక్షణ శిబిరానికి హార్దికంగా ఆర్థికంగా సహకరించి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఎండీ.ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, వైరా డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మండల కమిటీ సభ్యులు దాసరి మల్లయ్య, వల్లబోయిన కొండలరావు, కేసగాని ఉపేందర్, కరపటి సీతారాములు, తేజావత్ చందర్, బానోతు కిషన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ధారావత్ వినోద్ కుమార్, ఎజ్జు యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.



## ఎంజీయూ ఫార్మసీ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుల భర్తీ నియామకానికి నోటిఫికేషన్

**నల్లగొండ ప్రతినిధి,మే 09, (జనం సాక్షి):**
మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటైన ఫార్మసీ కళాశాలలో ఆర్ట్ టైం అధ్యాపకుల నియామకానికి రిజిస్టర్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఫార్మకాలజీ, ఫార్మకాప్నిసిస్, ఫార్మసిటికల్ కెమిస్ట్రీ, ఫార్మసిటిక్స్ సబ్జెక్టులలో పీహెచ్డీ, నెట్, గేట్, జి పాట్ మరియు బోధన అనుభవం కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 15 లోగా సమర్పించాలని ఆయన తెలిపారు.

# నర్సింగ్ పల్లిలో విరిసిన అరుదైన మే పుష్పం



**సిరికొండ, మే 9 (జనంసాక్షి):**
సిరికొండ మండలం నర్సింగ్ పల్లి గ్రామంలో అరుదైన "మే పుష్పం" విరబూసి గ్రామ ప్రజలను ఆకట్టుకుంటోంది. గ్రామానికి చెందిన సాల్మన్ సార్ ఇంటి ఆవరణలో పెంచిన ఈ పుష్పం ఎరుపు, గులాబీ రంగుల కలయికతో అందంగా వికసించి చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. సాధారణంగా హిమాలయ ప్రాంతాల్లో మాత్రమే వికసిస్తుందని పత్రికల్లో చదివే ఈ మే పుష్పం, ఇప్పుడు నర్సింగ్ పల్లిలో ఇంటి ఆవరణలోనే కనువిందు చేయడం విశేషమని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రస్తుతం ఒకేసారి ఐదు పుష్పాలు వికసించడంతో ఇంటి వద్దకు స్థానికులు చేరుకుని పూల అందాలను ఆస్వాదిస్తున్నారు.ఈ పుష్పం ప్రత్యేకత ఏమిటంటే సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే వికసించడం. అంతేకాకుండా పుష్పం వికసించినప్పుడు పరిసర ప్రాంతాలకు ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని స్థానికులు పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, చిన్నారులు ఈ పూలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఆవరణలో ఇలాంటి అరుదైన పుష్పాలు పెంచడం ద్వారా పర్యా వరణ పరిరక్షణకు తోడ్పాటు అందిం చవచ్చని గ్రామ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## స్టేట్ టాపర్ ని అభినందించిన త్రివేణి డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి





ఖమ్మం, (జనంసాక్షి) : ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 595 మార్కులతో , మూడవ స్థానం లో నిలచిన ఎల్ నేహా ను త్రివేణి విద్యాసంస్థల అధిపతి డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మా త్రివేణి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని, మా విద్యార్థులు చదువు లోనే కాక సమాజంలో ఎలా బతకాలో,సమాజాన్ని ఎలా ప్రేమించాలి అని కూడా మా త్రివేణి నేర్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 595 మార్కులు సాధించిన ఎల్ నేహా మాట్లాడుతూ నా విజయానికి మా పాఠశాల విద్యా ప్రణాళిక, స్టడీ అవర్స్ స్లాట్ ఎగ్జామ్స్ , ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం , మా పాఠశాలలో ఏర్పాటుచేసిన మోటివేషన్ క్లాసెస్ నా ఈ ర్యాంకు రావడానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఇలాంటి పాఠశాలను స్థాపించి నాలాంటి ఎందరో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్న డైరెక్టర్ ,యాజమాన్యానికి త్రివేణి పాఠశాలలోని ఉపాధ్యాయ బృందానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలియజేసింది. ఈ కార్యక్రమంలో సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, చీకటి అప్పారావు ,పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## గుండెపోటుతో ఇంగ్లీష్ టీచర్ గారపాటి జయరాజు మృతి



మధిర, మే 09 (జనంసాక్షి): మధిర పట్టణం 2వ వార్డు ఎంప్లాయిస్ కాలనీకి చెందిన ప్రముఖ ఇంగ్లీష్ టీచర్ గారపాటి జయరాజు గుండెపోటుకు మృతి చెందారు. శనివారం హార్ట్ స్ట్రోక్‌తో ఆయన ఆకస్మికంగా మృతి చెందడం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గారపాటి జయరాజు గతంలో మధిరలోని భరత్ జూనియర్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా సేవలందిస్తూ అనేక మంది విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన చేశారు. ప్రస్తుతం ఖమ్మం మమతా రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్ (ఒలింపియాడ్ క్యాంపస్) లో పనిచేస్తూ, ఉపాధ్యాయులకు బోధనా విధానాల్లో మెళకువలు నేర్పిస్తూ విద్యారంగానికి విశేష సేవలు అందిస్తున్నారు. మృదుస్వభావం, అంకితభావం విద్యపై ఉన్న నిబద్ధతతో అందరి అభిమానాన్ని సంపాదించారు.సీసీ కెమెరా దృశ్యాల్లో ఆయన కుప్పకూలిన తీరు చూసిన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేసింది. ఇలాంటి మంచి వ్యక్తి అకస్మాత్తుగా మన మధ్య లేకపోవడం విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్నేహితులు కుటుంబ సభ్యులకు తీరని లోటు అని పలువురు అన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని ఆహ్వానించిన నాయకులు

సూర్యాపేట(జనంసాక్షి): పెన్ పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం గ్రామంలో బుధవారం జరిగే శ్రీశీతల పరమేశ్వరి, శ్రీకనకదుర్గ పరమేశ్వరి, మారెమ్మ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొనాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ పెన్ పహాడ్ మండల మాజీ అధ్యక్షులు మిర్యాల వెంకటేశ్వర్లు, నాయకులు సింగం వెంకన్న, గండు శ్రీను, మామిడి వెంకటయ్య, అనుదేవర సతీష్ కలిసి ఆహ్వానించారు.

## మే 13న పాలీసెట్ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి



మధిర, మే 09 (జనంసాక్షి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 13న పాలీసెట్ పరీక్ష నిర్వహించ నున్నట్లు మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయ కర్త కె. సాంబయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు. మధిరలో మూడు సెంటర్లు మరియు ఖమ్మం లో 6 సెంటర్లు, మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 3696 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

**మధిరలో 3 కేంద్రాలు – మొత్తం 539 మంది:** ప్రభుత్వ పాలిటెక్నిక్ మధిర : 250, టివిఎం స్కూల్ : 150, సిపిఎస్ స్కూల్ : 139

**ఖమ్మంలో 6 కేంద్రాలు – మొత్తం 3157 మంది:** ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఏ) : 800, స్వర్ణ భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బిఐటి) : 600, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల : 600, దారిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాల : 500, డి.ఆర్.ఎస్ డిగ్రీ కళాశాల : 504, యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల (కేయూ) : 153

పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉందని నిమిషం ఆలస్యమైన లోనికి అనుమతి ఉండదని వెల్లడించారు.

## .ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

రామన్నపేట, మే 9 (జనంసాక్షి): రామన్నపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, ఆంధ్రప్రభ విలేకరి కుకుడాల మహేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం స్థానిక రహదారి బంగ్లాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్ ఆధ్వర్యంలో వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మాజీ ఎంపిటిసి సాల్వేర్ అశోక్, ఉప సర్పంచ్ మోటె రమేష్,బొడ్డు సురేందర్ రావు, ఎండి అక్రమ్, ఎండి అమ్జద్ తదితరులు ఉన్నారు.



## తిరుమలాయపాలెంలో ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు

తిరుమలాయపాలెం మే 5 (జనంసాక్షి ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం మరియు "రైతు వారోత్సవాల" లో భాగంగా మంగళవారం తిరుమలయ పాలెం లో రైతులకు ఉద్యాన పంటలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచడం, దాని ప్రాముఖ్యత, కూరగాయల సాగులో మెళకువలు మరియు సూక్ష్మ సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) ద్వారా ఉద్యాన పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై నిపుణులు రైతులకు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లా డుతూ.. రైతులు సంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఉద్యాన పంటల వైపు మళ్లాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని సూచించారు. వ్యవసాయ జిల్లా ప్రత్యేక అధికారి శివానంద్ మరియు పాలేరు ఏడీఏ ఎం. సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వి నియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధరావత్ సుజాత , గోద్రెజ్ వైస్ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త జాముని రాణి, ఉద్యాన అధికారి పి. అపర్ణ, మండల వ్యవ సాయ అధికారి ఎన్. సీతారామరెడ్డి ఆయి ల్ ఫామ్ రైతులు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ డ్రిప్ ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు, మండలంలోని పెద్ద సంఖ్యలో రైతులు ఈ అవగాహన సదస్సులో భాగస్వాములయ్యారు.




## 29 ఏళ్ల తర్వాత కలిసిన నిర్మల పాఠశాల పూర్వ విద్యార్థులు

హాలియా, మే 9 జనం సాక్షి: హాలియాలోని నిర్మల ఉన్నత పాఠశాలలో శనివారం 1996?1997 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంనల్లగొండ ఆంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 29 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు లింగారెడ్డి, అరవింద, నాగరాజు, సతీష్‌రెడ్డి, గోవిందరెడ్డి, రాజేష్, శైలజ, నాగజ్యోతి, కవిత, శ్రీదేవి సహకారంతో విజయవంతంగా నిర్వహించారు.



# ఓబీసీల హక్కుల సాధనకు వీహెచ్ దీక్షకు ఆకుల గాంధీ సంఘీభావం

○బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్

○ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్




**ఖమ్మం టౌన్ , మే 09 (జనంసాక్షి):**
దేశ జనాభాలో అధిక శాతం ఉన్న ఓబీసీలకు రాజ్యాధికారంలో సముచిత ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ పీసీసీ మాజీ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు చేపట్టిన ఆమరణ దీక్షకు మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆకుల గాంధీ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు 80 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న ఓబీసీలకు రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిందని, అలాగే కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చి, పార్లమెంట్‌లో చట్టం చేసి బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఆకుల గాంధీ కోరారు. జనగణనలో కులగణనను కూడా భాగం చేయాలని, తద్వారా చట్టసభల్లో ఓబీసీలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రంలో ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఓబీసీలకు న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచిత వాటా సాధన కోసం వీహెచ్ చేపట్టిన ఆమరణ దీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని ఆకుల గాంధీ పిలుపునిచ్చారు.



## రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికైన కల్లూరు శాంతినగర్ విద్యార్థులు

కల్లూరు మే 09(జనం సాక్షి)
కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ లో గల హెచ్ డబ్ల్యు ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న శాంతినగర్ కు చెందిన ఖమ్మంపాటి మహన్య. కాకటి లక్ష్మి విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీల్లో పాల్గొని హైదరాబాదులో ని హకీమ్ పేట క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. వీరి ఎంపికల పట్ల. కల్లూరు మండల విద్యాశాఖ అధికారిని పత్తిపాటి నివేదిత ,ప్రధానోపాధ్యాయురాలు మాధురి. సహోపాధ్యాయులు గుర్రాల సుధీర్. శాంతినగర్ డెవలప్మెంట్ కమిటీ పెద్దలు. క్రీడారంగా నిపుణులు డివై ఎస్ ఓ తుంబూరు సునీల్ రెడ్డి. స్టేడియం అడ్మినిస్ట్రేటర్ పసుపులేటి వీర రాఘవయ్య. స్టేడియం కోచస్ టీ గౌతమ్ ఎన్ గోపాల్ జి శ్రీనివాస్ ఫిజికల్ ట్రైనర్ నాగబాబు కల్లూరు మండల వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామదర్శికులు క్రీడా శిక్షణకు తోడ్పాటు అందించారు. ఇటీవల జరిగినరాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికల పోటీల్లో పాల్గొని అతింపేట క్రీడా పాఠశాలలో సీట్లు సాధించారు. ఈనెల 13, 14 తారీకులలో హకీంపేట క్రీడా పాఠశాలలో అడ్మిషన్ పొందటానికి వెళుతున్నారు.

# చలో పరేడ్ గ్రౌండ్ మోదీ సభకు మర్రిగూడ బీజేపీ సన్నాహాలు

**మర్రిగూడ, మే 9 (జనంసాక్షి)**
సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న జరిగే భారీ బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్న నేపథ్యంలో, సభను విజయవంతం చేసేందుకు మర్రిగూడ మండల బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని మండల అధ్యక్షులు పాత్లావత్ రాజేందర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభలో పాల్గొనాలని కోరారు."సుమారు ?8,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలకాలి. మోదీ



నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ వేదిక కానుంది" అని రాజేందర్ నాయక్ అన్నారు. శక్తి కేంద్రాల ఇన్చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు సమన్వయంతో వాహన సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలను తరలించాలని సూచించారు. మర్రిగూడ మండలం తన సత్తా చాటి, పరేడ్ గ్రౌండ్ సభలో భారీ భాగస్వామ్యం నమోదు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## తుమ్మల 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం

**- తుమ్మల చొరవతోనే భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధి**
**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**
**- తుమ్మల అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే తుమ్మల**
**- ఎస్.ఎ. రసూల్**

**భద్రాచలం మే 09 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏండ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్నారు. భద్రాచలం ఏజెన్సీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కే దక్కుతుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా తుమ్మల అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలంలో కరకట్ట నిర్మాణం, సీసీ రోడ్లు, రామాలయ అభివృద్ధి పనులు, 2013లో జరిగిన గోదావరి పుష్కరాల విజయవంతం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాలను సైతం ఏజెన్సీ వాసులకు అందించిన ఘనత మంత్రి తుమ్మల దే అన్నారు. అలాగే ఖమ్మం నుంచి వాజేడు మండలం లొట్టిపిట్టగండి వరకు అనేక చోట్ల రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు కాజ్‌వేలు, హైలెవల్ వంతెనలు నిర్మించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పార్టీలకతీతంగా అందరి మన్ననలు పొందిన తుమ్మల సేవలు ఎన్నటికి మరువలేమన్నారు. తుమ్మల అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే తుమ్మల అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ నాయకులు బుడగం శ్రీనివాసరావు, దారపునేని రాంబాబు, యశోద రాంబాబు, వెంకటరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

**మధిర మండల అధ్యక్షుడిగా పారుపల్లి విజయ్**

**మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా తలుపుల వెంకటేశ్వర్లు**

**మధిర, మే 9 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీల రూపకల్పనలో భాగంగా నియోజక వర్గంలో ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత మండల అధ్యక్షుల నియామకానికి తెరలేసింది. నాలుగు సార్లు మధిర నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత డిప్యూటీ సీఎం తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియామకం జరిగిన కమిటీల కూర్పు ఇప్పటివరకు కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం పార్టీ కోసం, డిప్యూటీ సీఎం గెలుపు కోసం పనిచేస్తు వస్తున్న నాయకత్వానికి బాధ్యతలను అప్పగించేందుకు సన్నద్ధమై భవిష్యత్తు పార్టీ విస్తరణ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు అభివృద్ధి పథకాల పై దృష్టి తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని డిప్యూటీ సీఎం సిఫార్సు మేరకు కొత్త కమిటీల ను జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రకటించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి అధ్యక్షులను మధిర నియోజకవర్గ కేంద్ర పరిధిలోని మధిర టౌన్ అధ్యక్షుని ప్రకటించారు.

**నూతనంగా ప్రకటించిన మండలాల అధ్యక్షులు వీరే**
పారుపల్లి విజయ్ కుమార్(మధిర)
తలుపుల వెంకటేశ్వర్లు (మధిర టౌన్)
గుడిపూడిబుచ్చి రామయ్య(ముదిగొండ)
కన్నేబోయిన గోపి యాదవ్ (చింతకాని)
కర్నాటిరామ కోటేశ్వరరావు (బోనకల్)
బొగ్గుల శ్రీనివాసరెడ్డి (ఎర్రుపాలెం) లను నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు విడుదలయ్యాయి.





**త్వరలోనే మండలాల వారీగా అనుబంధ కమిటీల నియామకం**
మండల పార్టీ అధ్యక్షులు నియామకం చేసిన క్రమంలో త్వరలోనే పూర్తిస్థాయి పార్టీ కమిటీలను అనుబంధ కమిటీలను నియమించేందుకు కసరత్తు దాదాపుగా పూర్తయింది. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలలో చురుకుగా వ్యవహరిస్తున్న వారికి పార్టీ పదవులలో అనుబంధ కమిటీల బాధ్యతలలో అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. త్వరలో జరగనున్న జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుత కొత్త కమిటీల కూర్పు నాయకత్వంలో అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కాగా పార్టీ బాధ్యతలు కమిటీల కూర్పు ప్రక్రియలో అంతిమ నిర్ణయం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలు ఆదేశాల మేరకు జరగడం తో అసంతృప్తుల అంశం అప్రస్తుత అంశంగా మారనున్నది అనేది సుస్పష్టం.

**డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు**
పార్టీ కి విధేయతగా ఉన్న తమకు కీలకమైన బాధ్యతలను అప్పగించడం పట్ల మధిర మండల కమిటీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్ పట్టణ కమిటీ అధ్యక్షునిగా నియామకమైన తలుపుల వెంకటేశ్వర్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణ బాధ్యతలతో పాటు ప్రజా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేందుకు డిప్యూటీ సీఎం మార్గదర్శకంలో తమ బాధ్యతలను నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

# సూర్యాపేట జిల్లాకు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలి




**సూర్యాపేట(జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ఎంసిపిఐయు పోలీట్ బ్యూరో సభ్యులు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ బీఎన్ రెడ్డి 18వ వర్ధంతిని సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ బిఎన్ రెడ్డి దళిత, బహుజనుల రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పనిచేశారని అన్నారు.నాడు సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం ఎర్రజెండా చేతబట్టి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర భీమిరెడ్డిదని అన్నారు. కమ్యూనిస్టుల ఐక్యత కోసం నిరంతరం పోరాడారని,వారి పోరాట స్ఫూర్తిని తీసుకొని కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. పోరాటాలకు, చైతన్యానికి వేదికగా ఉన్న సూర్యాపేట జిల్లాకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరును నామకరణం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, సిపిఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ రామచంద్రన్, అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, సిపిఐ నాయకులు శ్యామల అశోక్, ఎంసిపిఐయు జిల్లా నాయకులు నక్క శ్రీనివాస్, లింగంపల్లి ఓంకార్, లింగంపల్లి రాజు, శ్రీరామోజు ఉమేష్, నూకపంగు వైభవ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని జూనియర్ కళాశాల అధ్యాపకుల ప్రచారం

**నేరేడుచర్ల (జనంసాక్షి):** నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరి ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని శనివారం అధ్యాపక బృందం ఊరూరా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఇంచార్జ్ ప్రిన్సిపల్ పి. వెంకటరమణ ఆధ్వర్యంలో గరిడేపల్లి, నేరేడుచర్ల,పాలకవీడు మండలాల్లో ఆయా గ్రామాల్లో అధ్యాపకులు మూడు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాలలో తిరుగుతూ పదో తరగతి విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. గత సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించిన ఫలితాల వివరాలు, కళాశాల అందిస్తున్న వసతులు, సౌకర్యాలతో కూడిన కరపత్రాలను ముద్రించి విద్యార్థులకు తల్లిదండ్రులకు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు మూడు బృందాలుగా విడిపోయి ఆయా మండలాల గ్రామాల్లో ముమ్మరంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు,ప్రణతి, కే ఎల్ ఎన్ రావు, శ్రీనివాసులు, వెంకన్న ,అంజయ్య, సునీత, నరసింహ చారి ,గణేషు, ప్రసాదు, వీరు,అపర్ణ,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు శాపంగా మారిన
# కాంగ్రెస్ ప్రభుత్వం
### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే



**వలిగొండ, మే 9 (జనంసాక్షి)** మండల కేంద్రంలో శనివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తాల్ పేరుతో నట్టేట ముంచుతున్నారు. ఇన్ని సంవత్సరాల నుంచి లేని తాలు ఈ సంవత్సరం ఎక్కడ నుండి వచ్చింది ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులు భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. మొన్న యూరియా నేడు తాలు పేరుతో రైతులను మోసం చేస్తుందని. ప్రభుత్వం మిల్లర్లు కుమ్మక్కై రైతులను బలి చేస్తున్నారని ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని డిమాండ్ చేశారు.




## అసిస్టెంట్ కమాండెంట్ గా బి రాజు పదవి బాధ్యతలు

**నాగార్జునసాగర్ మే 9 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాగార్జునసాగర్ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ గా బి రాజు పదవి బాధ్యతలను స్వీకరించారు. నాగార్జునసాగర్ లోని జెన్కో, నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ యూనిట్ కు అసిస్టెంట్ కమాండెంట్ గా విధులు నిర్వహిస్తున్న విజయ భాస్కర్ రావు బదిలీపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న బి రాజు పదోన్నతి పై నాగార్జునసాగర్ ఎస్ పి ఎఫ్ విభాగానికి అసిస్టెంట్ కమాండెంట్ గా వచ్చారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ జెన్కో, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ లు ప్రతాప్ నాయుడు, శ్రీనివాస్ రావు మరియు సిబ్బంది వారికీ ఘనంగా స్వాగతం పలికారు.

## పోచంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో వేసవి శిబిరం ఈ నెల 11న ప్రారంభం

**భూదాన్ పోచంపల్లి, మే 9 (జనంసాక్షి):** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థినీ, విద్యార్థులకు 15 రోజుల వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భూదాన్ పోచంపల్లి ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 11నుండి 25 వరకు నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమంలో యోగా, ఇండోర్ ఆటలు, గణితం, మాట్లాడే ఇంగ్లీష్, సులభమైన సైన్స్ ప్రయోగాలు, క్విజ్ పోటీలు, నృత్యం, కళ హస్తకళ వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వబడుతుంది. విద్యార్థుల సృజనాత్మకత మరియు నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా ఈ శిబిరం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. కావున అన్ని విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా ఈ వేసవి శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

# అభిమాన నేత మంత్రి కావాలని.. మోకాళ్లపై కొండెక్కిన ముష్టిపల్లి వాసి!



**గుర్రంపోడు మే 09(జనంసాక్షి)** మునుగోడు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం, తమ అభిమాన నాయకుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి దక్కాలని కోరుకుంటూ ఓ అభిమాని అత్యంత కఠినమైన మొక్కును తీర్చుకున్నారు. మునుగోడు నియోజకవర్గం చివరి గ్రామమైన ముష్టిపల్లికి చెందిన ముష్టిపల్లి లింగస్వామి శనివారం నాంపల్లి మండలంలోని చలిదొన లక్ష్మీనరసింహ స్వామి గుట్టపై ఈ వినూత్న పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో రాజగోపాల్ రెడ్డి కి త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కాలని కాంక్షిస్తూ లింగస్వామి గుట్టపై ఉన్న 200 మెట్లను మోకాళ్లపైనే ఎక్కారు. ఈ కఠిన దీక్షను చూసి అక్కడి భక్తులు ఆశ్చర్యపోయారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావాలని, తద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ. మునుగోడు నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావడం ఎంతో అవసరం. ముఖ్యంగా నియోజకవర్గ పొలిమేరలో ఉన్న మా ముష్టిపల్లి వంటి గ్రామాల సమస్యలు తీరాలంటే ఆయనకు అధికారిక హోదా దక్కాలి. నియోజకవర్గ ప్రజలందరి కోరిక కూడా ఇదే. స్వామివారి కృపతో ఇది త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతున్న తరుణంలో, మునుగోడు ప్రజల ఆకాంక్షలు మరియు రాజగోపాల్ రెడ్డి పై ఉన్న నమ్మకాన్ని ఈ ఘటన చాటిచెబుతోంది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రాజగోపాల్ రెడ్డి అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబం సమాచారం దేశ ప్రణాళికలకు పునాది
### మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి



**నాగార్జునసాగర్ మే 9 (జనంసాక్షి)** నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇండ్ల గణన (సెన్సస్ 2027) చేయుటగాను అవసరమైన సెన్సెస్ కిట్ లను సూపర్వైజర్ల కు మరియు ఎన్నిమరేటర్లకు కమిషనర్ అశోక్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందికొండ కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ మొదటగా గణన గృహాలను గుర్తించి గణన గృహాలను లెక్కిస్తారు మొత్తం మున్సిపాలిటీని 31 బ్లాక్లుగా విభజించి 24 మంది ఎన్యూ మరేటర్లను మరియు నలుగురు సూపర్వైజర్లను అలాట్ చేశామని తెలిపారు. మే 11 నుండి హౌసింగ్ సెన్సెస్ మొదలు పెడతారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరు ఎంప్లాయిస్ విధిగా తమ యొక్కగృహాల సెల్ఫ్ ఎన్యూ మ రే షన్ పూర్తి చేయాలని కోరినారు అంతేకాకుండా విద్యావంతులైన వారందరు తమ యొక్క సెల్ఫ్ ఎన్యూ మరేషన్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాయి భరద్వాజ్, ఫీల్డ్ ట్రైనర్ పాపిరెడ్డి,సూపర్వైజర్లు వెంకట్ రమణ,శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, పాపిరెడ్డి, మరియు ఇతర ఏన్యూమరే టర్స్ పాల్గొన్నారు.

# దుకాణాలను పాత పద్దతిలోనే రెన్యువల్ చేయాలి

## నిరుద్యోగులకు మరిన్ని ఉద్యోగ అవకశాలు వచ్చేలా కృషి చేద్దాం



**యాదగిరిగుట్ట మే 9 ( జనంసాక్షి )**
యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయడం అంటే ఉపాధి పొందుతున్న పేదల, మధ్య తరగతి వారి పొట్ట కొట్టడమేనని, అలా కాకుండా ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే స్థానిక నిరుద్యోగ యువతకు అదనంగా దుకాణాలు వచ్చేలా దేవస్థానం వారితో ప్రభుత్వంతో పోరాడుదాం అని బి ఆర్ ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రే వెంకటయ్య, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరీలు అన్నారు. శనివారం వారు యాదగిరిగుట్ట బిఆర్ఎస్ కార్యాలయం లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాదగిరి గుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని కొంతమంది నిరుద్యోగులు పోరాటం చేస్తున్నారని వర్తక సంఘాన్ని రద్దు చేయాలి అని కాకుండా ఉన్న దుకాణా లను కొనసాగిస్తూనే తమకు కూడా దుకాణాలను కేటాయించాలని వారు కోరాలని అన్నారు. అలా అయితే తమ మద్దతు కూడా ఉంటుందని అన్నారు. 114 దుకాణాలకు గాను ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 500 మంది ఉపాధి పొందుతున్నారని, ఉన్న పలంగా వర్తక సంఘాన్ని రద్దుచేసి దుకాణాలను రద్దు చేయడం అంటే వారందరినీ రోడ్డున పడేయడమేనని అన్నారు. ఇది సరైన కాదని అన్నారు. నిరుద్యోగులకు యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉద్యోగ అవకశాలు కల్పించేందుకు అందరం కృషి చేద్దామని అన్నారు. ఇప్పటికైనా దుకాణాలను వర్తక సంఘాన్ని రద్దు చేయాలని వారి ఆందోళనను విరమించుకోవాలని కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు ఆరే శ్రీధర్ గౌడ్ , కాంటే కార్ పవన్ కుమార్, ముక్కెర్ల సతీష్ యాదవ్, అంకం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే అమలు చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
ఎస్‌బీఐ ఉద్యోగుల 16 డిమాండ్లను వెంటనే అమలు చేయాలని రీజినల్ సెక్రటరీ అయితగొని మహేష్ అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ సూర్యాపేట రీజియన్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లా డారు. గత మూడు దశాబ్దాలుగా నిలిచిపోయిన మెసెంజర్ల నియామకాలు చేపట్టాలని, ఆర్మ్ డ్ గార్డుల నియామకం,ఎన్పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ మార్చుకునే అవకాశం కల్పించాలని కోరారు.అవుట్ సోర్సింగ్ విధానాన్ని నిలిపివేసి తగిన సిబ్బందిని నియమించాలని అన్నారు.పెన్షన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెచ్‌ఆర్ ఎంఎస్ సమస్యలు, ఉద్యోగుల బదిలీలు, కెరీర్ ప్రోగ్రెషన్ స్కీమ్ వంటి అంశాలపై కూడా యాజ మాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



చేశారు. ఫెడరేషన్ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ఐ ంగా ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు.మే 25, 26వ తేదీలలో జరిగే రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు సురేష్, హేమలత, నవీన్, క్రాంతి, కిషోర్, ప్రియాంక, చందు, కిరణ్, నవ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కనగల్లు, మే 9 (జనంసాక్షి)
రామచంద్రాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు ఆ గ్రామ సర్పంచ్ అందుగల సువర్ణ వెంకటేశం ఓఆర్ఎస్ ద్రవణం ప్యాకెట్లతోపాటు, మంచినీళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సువర్ణ వెంకటేశం మాట్లాడుతూ రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఉదయంనే 6 గంటల నుంచి 11:00 వరకు పనులు జరిగేలా ఉపాధి హామీ క్షేత్రస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు సూచించిన విధముగా కూలీలు సకాలంలో పనులు జరిగే చోటకు వెళ్లి ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం పనులు చేసి కూలి వేతనం పొందాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పథకాలతో పాటు పనులు ఎంచుకొని వాటిని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లు రి శేఖర్, ఎఫ్ ఎ లింగయ్య, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, ఉపాధి కూలీలు ఉన్నారు.



# ఘనంగా లక్ష మల్లెల పూజ



**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి పంచాహ్నిక ఉత్సవంలో భాగంగా శనివారం వేద పండితులు ధరూరీ రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా లక్ష మల్లెల పుష్పార్చన నిర్వహించారు.స్వామి వారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకం నిర్వహించి, నూతన పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు.స్వామి వారికి అష్టోత్తర పూజలు నిర్వహించి, వడమాల సేవ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద సామూహిక లక్ష మల్లెల పూజ లతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ధరూరి శ్రీనాథచార్యులు సుందరకాండ పారాయణం నిర్వహించారు.దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు మాట్లా డుతూ నేడు లక్ష నాగవల్లి దళార్చన పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 12న హనుమ జయంతి సందర్భంగా 108 పర్యాయములు హనుమాన్ చాలీసా పారాయణం, స్వామివారికి నిత్య ఆరాధన, ప్రత్యేక అభిషేకం, అలంకరణ, నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన నిర్వహించి పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ధరూరి పవన్ కుమార్ ఆచార్యులు, శ్రీకాంత్ శర్మ, శ్రీనివాసచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## ఈ నెల 11 నుండి 25 తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం




**దేవరకొండ, మే 09(జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోనీ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల లో ప్రత్యేక వేసవి శిబిరాన్ని ఎం ఈ ఓ ఎం మాత్రూ నాయక్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరిపల్లి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల తేదీ 11వ తేదీ నుండి నుండి 25 వ తేదీ వరకు (15రోజులపాటు)ఈ శిబిరం కొనసాగుతుందనీ, ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించబడతాయనీ తెలిపారు. 5 వ తరగతి పూర్తి చేసి ప్రస్తుతం 6 నుండి 9వ తరగతి లో చేరబోయే విద్యార్థులందరూ ఈ శిక్షణకు అర్హులే అని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువే కాకుండా ఇతర సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడమే లక్ష్యంగా చిత్రలేఖనం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, నృత్యం , విద్యార్థులకు ఉల్లాసాన్నిచ్చే ఆటలు ,పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక ప్రశాంతత కోసం యోగా లాంటి వివిధ కార్యక్రమాలకు ఈ క్యాంపులో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు . ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం ( స్నాక్స్) ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులను ఈ సమ్మర్ క్యాంపుకు పంపి,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

# అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు

## జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు రవీందర్ శర్మ



**తుంగతుర్తి మే 9 (జనంసాక్షి)**
అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందుతుం దని రిపోర్టర్ ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు టీయూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ అన్నారు. శనివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో యూనియన్ సభ్యత్వాల నమోదు కార్యక్రమం లో టి యు డబ్ల్యూ జే ఐ జే యు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చలసాని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టియుడబ్ల్యూజే అనేక ఉద్యమాలు చేసిందని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి యూనియన్ ఎంతో కృషి చేసిందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులను అందజేయడానికి యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. రానున్న కాలంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఇంకా కృషి చేస్తుందని అన్నారు. మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఎన్నికైన రవీందర్ శర్మను ప్రెస్ మిత్రులు సన్మానించారు ఈ సందర్భంగా యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాత్రికేయులు పూసపెల్లి యాదగిరి, వడ్లకొండ శ్రీనివాస్, తాళ్లపల్లి సోమన్న, కొండగడుపుల ఎల్లయ్య, కోదాటి విక్రం రావు, ఓరుగంటి శ్రీనివాస్, ఎండి మజీద్, అండెం సైదులు లు పాల్గొన్నారు.